సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



'ట్రస్ట్ బోర్డ్'పై ఆశలు..
ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనుందనే సమాచారంతో రామాలయ ట్రస్ట్ బోర్డుపై ఆశలు చిగురిస్తున్నాయి. 10లో



గిరిజనుల వాగ్వాదం
ప్లాంటేషన్ భూమి విషయంలో శుక్రవారం అటవీశాఖ అధికారులతో గిరిజనులు వాగ్వాదానికి దిగారు. 10లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం 31° / 25°
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



న్యాయమూర్తి భానుమతి

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి.భానుమతి అన్నారు. శుక్రవారం కోర్టు హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ లోక్ ఆదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులు అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని, ఇదే అంతిమ తీర్పు అని తెలిపారు. రాజీకాదగిన క్రిమినల్, సివిల్, యాక్సిడెంట్ కేసులు, చిట్‌ఫండ్, భూ తగాదాలు, వివాహ బంధాలకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

ప్రభుత్వ విప్ కాంతారావు



బాధితులతో మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్‌లో రూ.4.50 కోట్లతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను, మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బాంబేకాలనీ వరకు సుమారు రూ.9కోట్లతో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం



రిటైర్డ్ కమిషనర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

బూర్గంపాడు: క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తేనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ కమిషనర్ చక్రపాణి అన్నారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. చదువులపై ఇష్టాన్ని పెంచుకోవాలన్నారు. పాఠ్యపుస్తకాలతోపాటు దినపత్రికలను తప్పకుండా చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీ.చిన్యా, అధ్యాపకులు సీహెచ్ నాగేశ్వరరావు, ఎస్ఎస్ కుమార్, కొండా ముకుందం, పీవీవీఎస్ఎన్ మూర్తి, జీ శ్రీనివాస్, సాహితి, జరీనా, భాను, నరేష్, శివ, రేష్మ, లక్ష్మీదీపిక పాల్గొన్నారు.



నోటిఫికేషన్‌లో 185 ఖాళీలు 726..

- ఉపాధ్యాయుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో ఖాళీల సంఖ్య తక్కువగా చూపారని అభ్యర్థుల ఆవేదన
- పోస్టులను కుదిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల ఆరోపణ

జిల్లాలో భర్తీచేసే పోస్టుల వివరాలు

విభాగం	ప్రభుత్వ	లోకల్ బాడీ
స్కూల్ అసిస్టెంట్లు	4	72
భాషా పండితులు	0	7
వ్యాయామ	1	0
సెకండరీ గ్రేడ్	9	92

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను ఊరించి ఉసూరుమనిపించింది. ఆరేళ్ల తర్వాత డీఎస్సీ ప్రకటించడంతో ఆశపడిన ఉద్యోగార్థులు పోస్టుల సంఖ్య చూసి నిరాశ చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు 2017 తర్వాత మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో 185 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చూపింది. కరోనా తర్వాత సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందనే ఆలోచనతో ప్రభుత్వం ఖాళీలు ఎక్కువగా ఉన్నా తక్కువ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత కొంతమేర తీరుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు పేర్కొంటున్నారు.

ఖాళీలు ఎక్కువ.. ప్రకటించిన పోస్టులు తక్కువ

జిల్లాలో 185 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు దరఖాస్తు గడువు విధించింది. కాగా 2019–20 విద్యాసంవత్సరంలో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి జిల్లాలో 602 మంది విద్యావలంటీర్లను నియమించారు. అప్పటి నుంచి ఖాళీల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం విద్యావలంటీర్లను కూడా తొలగించారు. దీంతో జిల్లాలో 726కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కానీ ప్రభుత్వం పోస్టుల సంఖ్య తక్కువ చేసి నోటిఫికేషన్ విడుదల చేసిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 101 ఖాళీగా ఉంటే నోటిఫికేషన్‌లో 76 మాత్రమే చూపారని వాపోతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. 2022–23లో పదో తరగతి ఫలితాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో భద్రాద్రి జిల్లా 29వ స్థానానికి పడిపోయింది.

ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న అభ్యర్థులు

జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఏళ్ల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కొందరు స్టడీ సెంటర్లలో, మరికొందరు హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల్లోని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. ఇంకా కొందరు స్థానిక గ్రంథాలయాల్లో చదువుకుంటున్నారు. ఈ సారి నోటిఫికేషన్‌లో ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో వందల మంది పరీక్షకు సిద్ధమవుతున్నారు. కానీ ప్రభుత్వం పోస్టులను తక్కువగా చూపి తమను నిరాశకు గురిచేసిందని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 726 ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే ఉపయోగకరంగా ఉండేదని పేర్కొంటున్నారు.

ఖాళీలన్నింటికీ నోటిఫికేషన్ ఇవ్వాలి

జిల్లాలో 726కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం 185 పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదు. మొత్తం ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలి. ఎన్నో ఏళ్ల నుంచి డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు నిరుత్సాహపడుతున్నారు.

–అశోక్, విద్యావలంటీర్

పోస్టులను కుదిస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టులను కుదించే చర్యలో భాగంగా తక్కువ సంఖ్యలో నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో కూడా 600పైగా ఖాళీలున్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. అన్నింటినీ భర్తీ చేయాలి.

–బి.రాజు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

జిల్లాలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో 185 పోస్టులు ఉన్నాయి. అర్హులు దరఖాస్తులు చేసుకోవాలి. ఈ నెల 20 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు.

–వెంకటేశ్వరచారి, జిల్లా విద్యాశాఖాధికారి

తగ్గుతూ.. పెరుగుతూ..

భద్రాచలం వద్ద 31 అడుగులకు చేరిన గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి

భద్రాచలంటౌన్: ఎగువ ప్రాంతాల ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి మూడు రోజులుగా తగ్గుతూ పెరుగుతూ దోబుచులాడుతోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద రావడంతో ఈ నెల 7న గోదావరి నీటిమట్టం 32 అడుగులకు చేరుకుంది. తిరిగి 29 అడుగులకు తగ్గి శుక్రవారం ఉదయం నుంచి స్వల్పంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం 31 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తుండగా, ఇంకా స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

తేగడ వద్ద నెమ్మదిగా..

చర్ల: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తేగడలోని తాలిపేరు హైలెవల్ వంతెన వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గోదావరి, తాలిపేరు నదుల ఎగువ ప్రాంతాల్లోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతోపాటు తెలంగాణలోని ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో లెవల్ వంతెన నీటమునిగింది. తాలిపేరు ప్రాజెక్టుకు చెందిన 9 గేట్లను ఎత్తి 6,245 క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

నేడూ అభ్యంతరాల స్వీకరణ

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల జాబితాపై అభ్యంతరాలు, అప్పీళ్ల స్వీకరణ నిమిత్తం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, సింగరేణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెరిఫికేషన్ క్యాంప్ నిర్వహించారు. క్యాంప్‌ని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి పరిశీలించి మాట్లాడుతూ బదిలీలపై 11, పదోన్నతులపై 40 అప్పీళ్లు స్వీకరించినట్లు వివరించారు. శనివారం కూడా అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, జాబితా, ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లపై అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్లతో హాజరు కావాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకులు కె.జ్యోతి, సిబ్బంది అప్పారావు, కిరణ్ కుమార్, వెరిఫికేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

టెట్‌కు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ రాంబాబు




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూపర్‌బజార్(కొత్తగూడెం): టెట్(టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. ఈ నెల 15న నిర్వహించే టెట్‌పై కలెక్టరేట్‌లో శుక్రవారం విద్య, వైద్య, పోలీస్, పంచాయతీ, మున్సిపల్, మిషన్ భగీరథ, విద్యుత్, ట్రెజరీ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం పరీక్షకు 37 కేంద్రాలు, సాయంత్రం పరీక్షకు 29 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 8,717 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్ష నిర్వహణకు 380 మంది ఇన్విజిలేటర్లు, 148 మంది హాల్ సూపరింటెండెంట్లు, 37 మంది శాఖాపరమైన అధికారులు, 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 9 మంది రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను సంప్రదించాలని సూచించారు. ఏఎస్పీ విజయబాబు, డీఈఓ వెంకటేశ్వరాచారి, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ స్వామి, ఆర్టీసీ డీవీఎం భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హస్తంలో హైరానా!

- పొత్తు విషయమై కాంగ్రెస్, సీపీఐ మధ్య చర్చలు
- కొత్తగూడెం సీటును డిమాండ్ చేస్తున్న కామ్రేడ్లు
- జనరల్ స్థానం కావడంతో కాంగ్రెస్‌లోనే తీవ్ర పోటీ
- గూడెం ఆశావహులకు మింగుడు పడని 'పొత్తు'



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాంగ్రెస్, సీపీఐల మధ్య పొత్తు అంశం జిల్లా హస్తం పార్టీ నేతల్లో కలవరానికి కారణమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా తమకు ఐదు సీట్లు కేటాయించాలని సీపీఐ ఆది నుంచి డిమాండ్ చేస్తోంది. ఇందులో కొత్తగూడెం, మునుగోడు, బెల్లంపల్లి, వైరా, హుస్నాబాద్ స్థానాలను పేర్కొంది. ముఖ్యంగా కొత్తగూడెం నుంచి పోటీ చేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఏడాది కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాపోరాటాలు చేస్తూ కేడర్‌ను క్రియాశీలకంగా ఉంచుతున్నారు. కొత్తగూడెం సీటు వ్యవహారం తేలాకే మిగిలినవి చర్చలోకి వస్తాయని ఇప్పటికే కూనంనేని పలుమార్లు తేల్చిచెప్పారు. దీంతో పొత్తుల సందర్భంగా కొత్తగూడెం సీటు విషయంలో పీటముడి పడే అవకాశం ఉంది.

కామ్రేడ్లకు గెలుస్తామనే ధీమా!

ప్రస్తుతం కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు కంకి కొడవలి గుర్తుపై పోటీ చేయబోయే అభ్యర్థి గెలిచేందుకు అనుకూలంగా ఉన్నాయని సీపీఐ అంచనా వేస్తోంది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఒక్కసారిగా పుంజుకుంది. క్షేత్రస్థాయిలో వార్డు మెంబర్లు మొదలు జెడ్పీ చైర్మన్ వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే ఎక్కువ స్థానాల్లో విజయం సాధించారు. బీఆర్ఎస్ బలోపేతం కావడంతో ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ నష్టపోయినట్టు సీపీఐ అంచనా వేస్తోంది. ఇదే తరుణంలో పొంగులేటి, తుమ్మల వంటి బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ వైపు మళ్లడంతో ఆ మేరకు బీఆర్ఎస్ కూడా నష్టపోతుందనే భావన నెలకొంది. ఒకవేళ జలగం వెంకట్రావు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకే నష్టం తప్పితే తమకేమీ కాదనే నమ్మకం కామ్రేడ్లలో నెలకొంది. పైగా కాంట్రాక్ట్ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఆటోలు, హమాలీ తదితర విభాగాల్లో కార్మిక సంఘాలకు ఇంకా పట్టుండటం తమకు లాభిస్తుందనే నమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నారు. దీంతో కొత్తగూడెం సీటును తమకే ఇవ్వాలంటూ గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో ఆశావహులు పది మంది

కొత్తగూడెం నుంచి పోటీ చేసేందుకు పది మంది ఆశావహులు ఇప్పటికే గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించుకున్నారు. అనంతరం వడపోతలో తమ పేర్లు ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. కొత్తగూడెం –హైదరాబాద్‌ల మధ్య చక్కర్లు కొడుతూనే పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ తరుణంలో పొత్తుల అంశం తెర మీదకు రావడం హస్తం గుర్తుపై పోటీ చేయాలని భావించిన నాయకులకు మింగుడు పడటం లేదు. మరోవైపు పొత్తుల విషయంలో సీట్ల సర్దుబాటు జరిగితే జనరల్ స్థానాలు ఇవ్వడం కష్టమని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. జనరల్ స్థానాల్లో నేతల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. ఈ సమయంలో పొత్తుల్లో సీటు ఇతర పార్టీలకే కేటాయిస్తే లాభం కంటే నష్టం ఎక్కువనే భావన హస్తం పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

ఇటీవల వరకు బీఆర్ఎస్ నేతలకు టెన్షన్

కొత్తగూడెం సీటును తమకే ఇవ్వాలని సీపీఐ బలంగా కోరడం, గతంలో బీఆర్ఎస్ నేతల్లో టెన్షన్‌కు కారణమైంది. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత కమ్యూనిస్టులతో పొత్తు ఉంటుందని సీఎం కేసీఆర్ ప్రకటించడం కొత్తగూడెం నేతలకు మింగుడు పడలేదు. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపించిన నేతలు రాబోయే ఎన్నికల్లో పొత్తులు, సీట్ల సర్దుబాటు విషయమై ఒత్తిడికి లోనయ్యారు. అయితే సీఎం కేసీఆర్ ఏకపక్షంగా తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించి పొత్తులకు ఆస్కారం లేదని తేల్చి చెప్పారు. అప్పటి నుంచి కాంగ్రెస్, సీపీఐల మధ్య పొత్తుపై ఊహాగానాలు మొదలయ్యాయి. దానికి తగ్గట్టే ఇటీవల ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణల మధ్య చర్చలు జరిగాయి. ఇప్పటికే జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో ఈ రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ ఎన్నికల్లో కలిసి ముందుకు వెళ్లేందుకు ఇరుపార్టీలు సుముఖత వ్యక్తం చేశాయి. అయితే సీట్ల సర్దుబాటు అంశం ఇంకా చర్చకు రాలేదు.

పైపులైన్లకు మరమ్మతులు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి, లీకేజీలను నివారించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఎంపీడీఓలను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు, తడి, పొడి చెత్త సేకరణ, పంచాయతీ భవనాల నిర్మాణం, హరితహారం, ఉపాధి హామీ పథకం పనులు, తాగునీటి సరఫరా, స్వీప్ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై పంచాయతీరాజ్, వైద్య, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి ట్యాంకులను 10 రోజులకోసారి శుభ్రం చేయాలన్నారు. జిల్లాలో 286 పంచాయతీలకు భవనాలు మంజూరు చేశామని, వాటిలో 31 చోట్ల పనులు ప్రారంభించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు ఇచ్చిన నివేదికలలో వ్యత్యాసం ఉందని, తప్పుడు నివేదికలు అందజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే వారంలో అన్ని పనులు ప్రారంభం కావాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వారంరోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాని ఆదేశించారు. మంగళ, శుక్రవారాల్లో ప్రతి ఇంట్లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించాలన్నారు. జ్వరాలు ప్రబలే ప్రాంతాల్లో ఫీవర్ సర్వే చేపట్టి వైద్య శిబిరాల నిర్వహించాలని చెప్పారు. ప్రజలు ఆర్ఎంపీలను ఆశ్రయించకుండా, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యసేవలు పొందేలా చూడాలన్నారు. స్థల సమస్య ఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణాలపై నివేదికలు అందజేయాలన్నారు. ఓటు హక్కు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూధన్‌రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు రమాకాంత్, విద్యాలత, మరియన్న, శిరీష, రవిబాబు, నళిని, శ్రీనివాసరావు, మంగ్యా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో 'బీసీ' కాక

- ఖాళీగా ఉన్న జిల్లా అధ్యక్ష పదవి
- నేతల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ
- హైదరాబాద్‌లో ఆశావహుల లాబీయింగ్
- తెరపైకి కొత్తగా బలహీనవర్గాల డిమాండ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారతీయ జనతా పార్టీలో జిల్లా అధ్యక్షుడి ఎన్నిక అంశం ముదురుపాకాన పడింది. గత వారం రోజులుగా కొత్త అధ్యక్షుడి ఎన్నికపై పార్టీ పరంగా వడపోతలు జరుగుతున్నాయి. మరోవైపు అధ్యక్ష పదవి కోసం ఆశావహులు ఎవరికి వారుగా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. నిన్నా మొన్నటి వరకు ఐదారుగురి పేర్లు అధ్యక్ష పదవి రేసులో ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య మూడుకు పడిపోయిందని పార్టీ వర్గాలు అంటున్నాయి. మరి వీరిలో ఎవరిని అధ్యక్ష పదవి వరిస్తుందో తేలాలంటే మరో వారం, పది రోజులు ఆగాల్సిందే.

మద్దతు యత్నాల్లో..

బీజేపీ సీనియర్ నేత, రెండుసార్లు జిల్లా అధ్యక్ష పదవి చేపట్టిన బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరోసారి అధ్యక్ష పదవి కోసం ఉవ్విళ్లూరుతున్నారు. తన సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని మద్దతు ఇవ్వాలంటూ మండలాల వారీగా నేతలను ఆయన కోరుతున్నారు. మరోవైపు ఇదే అంశంపై హైదరాబాద్‌కు వెళ్లి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని వ్యక్తిగతంగా కలిశారు. అయితే అధ్యక్ష పదవిపై ఆయనకు ఎలాంటి హామీ లభించలేదని సమాచారం. గతంలో ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జిల్లాలో ఆశించిన స్థాయిలో పార్టీ ఎదుగుదల లేకపోవడం ఆయనకు మైనస్‌గా మారే అవకాశం ఉంది.

పనితీరు చూడండి..

అధ్యక్ష పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నవారిలో మరో నేత యడ్లపల్లి శ్రీనివాస్. ప్రస్తుతం జిల్లా జనరల్ సెక్రటరీగా ఉన్న ఆయన తన పనితీరును పరిగణనలోకి తీసుకుని పార్టీ పరంగా ప్రమోషన్ కల్పించాలని కోరుతున్నారు. గత రెండేళ్లుగా పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనడం, పార్టీ పరంగా జిల్లాలోని నియోజకవర్గాల వారీగా సమాచారంపై అవగాహన కలిగి ఉండటం యడ్లపల్లికి సానుకూల అంశంగా ఉంది. ఇటీవల ప్రవాస్ ఎమ్మెల్యేల కార్యక్రమంలోనూ ఆయన చురుగ్గా పాల్గొన్నారు.

బీసీ ఎజెండా

జిల్లా అధ్యక్ష పదవి రేసులో ముందు వరుసలో కుంచె వెంకట రంగాకిరణ్ ఉన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన రంగా కిరణ్‌కు అధ్యక్ష పదవి ఇవ్వాలంటూ ఆయన మద్దతుదారులు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో నాలుగు ఎస్టీలకు రిజర్వ్ కావడంతో ఎస్సీ, బీసీ నేతలకు పార్టీ పదవులు తప్ప రాజకీయంగా పెద్దగా అవకాశం లేదని వారు వాదిస్తున్నారు. అయితే పార్టీ పరంగా గడిచిన కొన్నేళ్లుగా జిల్లా అధ్యక్ష పదవి పూర్తిగా అగ్రవర్ణాలకే దక్కుతోందని అంటున్నారు. ఇప్పటి వరకు అధ్యక్ష పదవి కొదమసింహం పాండురంగాచార్యులు, జీవీకే మనోహర్, దారపునేని కోటేశ్వరరావు, కోనేరు సత్యనారాయణ, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితర అగ్రవర్ణాలకే దక్కిందని, ఈసారి బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు పెద్దమ్మగుడి వద్ద వైశ్యుల ఆత్మగౌరవ సభ

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ సముదాయంలో అమ్మ ఫంక్షన్‌హాల్లో శనివారం వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో చర్చాగోష్టి నిర్వహిస్తున్నామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ కోశాధికారి, ములకలపల్లి గ్రేటర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు బిక్కుమల్ల సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పర్ణశాల ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు



పర్ణశాల వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని స్వామివారి సన్నిధానంలో శుక్రవారం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని భక్తుల సందడి నడుమ నిర్వహించారు. తర్వాత స్వామివారి తిరువీధి సేవా కార్యక్రమం నిర్వహించి విశేష ప్రసాద నివేదన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, అమరవాది కిశోర్‌కుమారాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపిన టిప్పర్

టేకులపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ని టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఎస్‌ఐ గస్ రెడ్డి రమణారెడ్డి వివరాలు వెల్లడించారు. అనుమతులు లేకుండా కొత్తగూడెం వైపు నుంచి ఇసుక లోడ్‌తో టిప్పర్ వస్తుండగా పోలీసులు పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. కాగా, ఇసుక టిప్పర్‌ను గురువారం ఉదయమే పట్టుకుని పోలీస్ స్టేషన్ ఎదుటే ఉంచిన పోలీసులు.. శుక్రవారం వివరాలు వెల్లడించడం గమనార్హం.

గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయిని చూపుతున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం అట వీ ప్రాంతంలో సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 48.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన సమురేశ్ సర్కార్, ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన సంజిత్‌సిక్‌బార్ ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో 43 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. మరో ఇద్దరు ద్విచక్రవాహనంపై 5.4 కిలోల గంజాయిని తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేస్తున్న క్రమంలో పారిపోయారు. పట్టుబడిన ఇరువురిపై కేసు నమోదు చేయడంతోపాటు గంజాయి రవాణాకు వినియోగించిన కారు, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ తిరుపతిరావు, ఇల్లెందు ఎస్‌హెచ్‌ఓ రాంప్రసాద్, ఎస్‌ఐలు సర్వేశ్వర్, బషీర్, గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని మొండితోగు గ్రామపంచాయతీ చెరువుకట్ట ప్రాంతానికి చెందిన బండి కమల్‌కుమార్ (32) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కొంతకాలంగా కుటుంబ సభ్యులతో ఘర్షణ పడుతున్న కమల్‌కుమార్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు కమల్‌ను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే అతను మృతిచెందాడు. కుటుంబ స భ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ సమీపంలో ఇటీవల సీతారామ కాలువ నిర్మాణ పనులకు సంబంధించిన ఐరన్ సెంట్రింగ్ ప్లేట్లు చోరీ చేసిన నిందితులను పోలీసులు శుక్రవారం అదుపులోని తీసుకున్నారు. మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన నలుగురు నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారి వద్ద నుంచి రూ.32 వేల విలువైన సెంట్రింగ్ ప్లేట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ షాహీన తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

‘ట్రస్ట్ బోర్డ్’పై ఆశలు..

- నామినేటెడ్ పోస్టులపై ప్రభుత్వం దృష్టి
- పార్టీ అసంతృప్తులను బుజ్జగించేయత్నం
- ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న ‘భద్రాద్రి’ ఆశావహులు



రామాలయం

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి ట్రస్ట్ బోర్డుపై ఆశావహుల్లో ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను బీఆర్‌ఎస్ అధినాయకత్వం ప్రకటించిన నేపథ్యంలో ఎగసిపడుతున్న అసమ్మతి జ్వాలలను చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం. అందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎనిమిదేళ్లుగా దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ భర్తీకై ఎదురుచూస్తున్న ఆశావహులు ప్రభుత్వ పెద్దల చల్లని చూపునకు ఎదురుచూస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా నిరీక్షణ

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఇప్పటి వరకు 13 ట్రస్ట్ బోర్డులు పూర్తయ్యాయి. చిట్ట చివరి ట్రస్ట్ బోర్డ్ 2010, నవంబర్ 26 నుంచి 2012, నవంబర్ 25 వరకు కురిచేటి పాండురంగారావు చైర్మన్‌గా పనిచేసింది. ఆ తరువాత ఇంతవరకు 14వ పాలక వర్గం కొలువు తీరలేదు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 14 మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసింది. దీంతో బీఆర్‌ఎస్ నేతలు, ఉద్యమకారులు, తటస్థ వ్యక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు ఈ ట్రస్ట్ బోర్డులో చోటు సంపాదించేందుకు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు.

అసమ్మతి నేతలను బుజ్జగించేందుకే..!

రెండుమార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రామాలయ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయటంలో నిర్లక్ష్యం ప్రదర్శించింది. అయితే, రానున్న ఎన్నికలకు గాను ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థుల జాబితాపై అనేకచోట్ల అసమ్మతి వస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి తోడు శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం కొలువై ఉన్న భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ సెగ తారాస్థాయికి చేరింది. దీంతో ప్రభుత్వం ‘రామమంత్రం’ ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లుగా రెండు రోజులుగా ప్రచారం సాగుతోంది. భద్రాచలం ట్రస్ట్ బోర్డుకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. పలు రాష్ట్రాల నుంచి వచ్చే వీఐపీల దర్శనాలు, దేవస్థానం అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల ఏర్పాట్ల నిర్ణయాలలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుంది. నామినేటెడ్ పోస్టుల్లో అసంతృప్త నేతలను కూర్చోబెట్టి బుజ్జగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ఈ పాలకవర్గం కాలం రెండేళ్లు ఉండే అవకాశం ఉండటంతో అధికార పార్టీ నాయకులు సైతం ఈ బోర్డులో స్థానం పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. చివరి పాలకవర్గంలో చైర్మన్, తొమ్మిది మంది సభ్యులతో పాటు ఒకరు ఎక్స్‌అఫీషియో సభ్యుడు అనగా రామాలయ ప్రధాన అర్చకులు లేదా ఉద్యోగ విరమణ చేసిన అర్చకులు సభ్యులుగా ఉన్నారు. అయితే, ఈ మారు 14 మంది సభ్యులతో ట్రస్టు బోర్డ్ ఏర్పడే అవకాశం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది బోర్డులో కొలువుతీరేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇప్పటికే అనేక మంది ప్రభుత్వ పెద్దల వద్ద తమ బయోడేటా సమర్పించారు. మళ్లీ ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తే ఈ జాబితా పెరిగే అవకాశం ఉంది.

ఉమ్మడి రాష్ట్రంలో 13 సార్లు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు 13 ట్రస్ట్ బోర్డులు కొలువుతీరాయి. తొలిసారిగా 1960లో భద్రాచల దేవస్థానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దేవాదాయ శాఖ పరిధిలోకి రాగా, నాటి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి చైర్మన్‌గా భద్రాచల దేవస్థాన అభివృద్ధి కమిటీ ఏర్పాటైంది. దీంతో తొలి ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కల్లూరి చంద్రమౌళి పేరు దేవస్థానం రికార్డులలో నమోదైంది. అప్పటి నుంచి 2012, నవంబర్ వరకు 13 ట్రస్టు బోర్డులు సేవలు అందించాయి. కల్లూరి చంద్రమౌళి, బండి శోభనాచలం, ఎస్.యతిరాజారావు, అల్లూరి మూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్, కోనేరు నాగేశ్వరరావు, బోర్ల వెంకటేశ్వరరావు, కత్తుల శాంతయ్య, కొండబాల వెంకటేశ్వరరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కురిచేటి పాండురంగారావులు చైర్మన్‌లుగా తమ సేవలను అందించారు. రెండు మార్లు అల్లూరి మూర్తి రాజు చైర్మన్‌గా పనిచేయగా, చివరి పాలకవర్గం చైర్మన్‌గా కురిచేటి పాండురంగారావు పనిచేశారు.

పోలీసులకు సమాచారం అందించాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: ఇల్లు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు 87126 82106 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పూర్తి వివరాలు అందించాలని ఏఎస్పీ పరితోష్ పంకజ్ కోరారు. శుక్రవారం ఏఎస్పీ కార్యాలయంలో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజలు తమ పూర్తి వివరాలతో పాటు కాంటాక్ట్ నంబర్, ఏ రోజు నుంచి ఏ రోజు వరకు ఊరికి వెళ్తున్నారు?, గూగుల్ లొకేషన్‌ను పంపించడం ద్వారా ఆ పరిసర ప్రాంతాల్లో పోలీస్ బీట్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. భద్రాచలం రాష్ట్ర సరిహద్దులలో ఉన్నందున చోరీలను అరికట్టడంలో భాగంగా అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు సాధ్యమైనంత వరకు విలువైన వస్తువులను, ఆభరణాలను తమ ఇళ్లల్లో పెట్టి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టౌన్ సీఐ నాగరాజురెడ్డి, ఎస్‌ఐలు మధుప్రసాద్, పీవీఎన్ రావు, విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

సమన్వయంతో వినాయకచవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో శుక్రవారం బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్, ముస్లిం మైనార్టీ, గోరక్షణ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. అందరూ మత సామర్యం పాటించాలని, మండలపాల వద్ద రాత్రి సమయంలో మైకులు పెట్టొద్దని పేర్కొన్నారు.

కేటీపీఎస్‌లో ముగ్గురు ఇంజనీర్లపై ఫిర్యాదు

పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో ముగ్గురు ఇంజనీర్లపై జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుకు పేరు లేకుండా ఫిర్యాదు లేఖ అందింది. ఈఈ పేషీలో పనిచేసే ఏడీఈ, ఏఈ, ఎస్‌ఈ (ఏడీఎం) పేషీలో పనిచేసే మహిళా ఏడీఈపై పలు అంశాలతో ఫిర్యాదు చేశారు. ఇంజనీర్లు సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారని, యూనియన్ నేతలు సీఈని కలిసేందుకు వస్తే అమర్యాదగా వ్యవహరిస్తూ కలవనీయడం లేదని, ఆర్టిజన్ కార్మికులతో సొంత పనులు చేయించుకుంటున్నారని, డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని.. తదితర అంశాలను ఉదహరిస్తూ ఫిర్యాదు చేశారు. దీంతో సీఎండీ స్పందించి విజిలెన్స్ అధికారులను విచారణ చేయాలని, నిజానిజాలు తెలుసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై సీఈ ఎం.ప్రభాకర్‌రావును వివరణ కోరగా కొందరు ఇంజనీర్ల మధ్య పడక పోవడంతో పేరు లేకుండా సీఎండీకి లేఖ రాసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఉద్దేశపూర్వకంగా చేసినట్లు తెలుస్తోందని, కావాలని చేసే వారిపై విచారణ చేస్తామని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ఒకే చోట కొందరు ఇంజనీర్లు, సిబ్బంది పనిచేస్తుండటంతో ఇలాంటి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నట్లు తెలుస్తోంది. కొందరు యూనియన్ నేతలు సైతం అధికారులపై పెత్తనం చెలాయించే ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఇంజనీర్లు సైతం వాపోతున్నారు.

తాలిపేరు తొమ్మిది గేట్ల ఎత్తివేత



తాలిపేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

చర్ల: తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు ఎగువ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు అక్కడి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అందులోని ఎక్కువ వాగులు తాలిపేరులోనే కలుస్తుండటంతో ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు చెందిన 9 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి ఉంచి 6,245 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి నేపథ్యంలో నీటిమట్టాన్ని 73.30 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. ప్రాజెక్టుకు చెందిన కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 172 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

‘పోస్టర్ తయారీ’ విజేతల ప్రకటన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జరిగిన పోస్టర్ తయారీ పోటీల్లో విజేతలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి శుక్రవారం ప్రకటించారు. ప్రథమ స్థానంలో పాల్వంచ బాలికోన్నత పాఠశాలకు చెందిన జు.సఫియా బర్కత్, ద్వితీయ స్థానంలో కరకగూడెం కేజీబీవీకి చెందిన జి.దీక్షిత, తృతీయ స్థానంలో సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన అభిమన్యు నిలిచారు. విజేతలకు నగదు పారితోషికంగా రూ.500, రూ.300, రూ.200 అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విజేతలు త్వరలో రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలకు సమన్వయకర్తగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు, సింగరేణి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పూల్ సింగ్ పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిరసన



ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు శుక్రవారం ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. కాగా, సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకులు ఊకంటి గోపాల్‌రావు, నాగా సీతారాములు సందర్శించి మద్దతు ప్రకటించి ప్రసంగించారు. 16 ఏళ్లుగా వెట్టిచాకిరీ చేయించుకుంటున్న వారిని ఇంకా రెగ్యులర్ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెంటనే రెగ్యులర్ చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎండీ యూసుఫ్, ఎన్‌హెచ్‌ఎం నాయకులు శ్రీనివాస్, ప్రశాంత్, సింధు, శ్రీను, శారద తదితరులు పాల్గొన్నారు.

గోల్‌మాల్ జరిగిన ఆరు నెలలకు విచారణ

పాల్వంచరూరల్: గోల్‌మాల్ జరిగిన ఆరు నెలల తర్వాత జీసీసీలో సంబంధిత అధికారులు విచారణ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పాల్వంచ బ్రాంచ్ గోదాంలోని సరుకుల నిల్వలను మార్చిలో డీఎం విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. రూ.3.20 లక్షల విలువైన సరుకులు లేకపోవడంతోపాటు మరికొన్ని సరుకులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. గోల్‌మాల్‌పై గోదాము ఇన్‌చార్జ్‌గా ఉన్న అకౌంటెంట్ సంజీవరావుపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ ఎండీ క్రిస్టినా జెడ్ చోంగ్తు అకౌంటెంట్‌ను సస్పెండ్ చేసి, అవకతవకలపై విచారణకు ఆదేశించారు. ఆరు నెలల తర్వాత హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచి అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ పద్మావతిని విచారణ అధికారిగా నియమించగా ఆమె శుక్రవారం జీసీసీకి వచ్చి సంజీవరావును విచారించారు.

చోరీ కేసులో బాలుడు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

ఇల్లెందు: పట్టణంలోని పెద్దమ్మతల్లి, ముత్యాలమ్మ ఆలయాల్లో అమ్మవార్ల ఆభరణాల చోరీ కేసులో బాలుడిని అరెస్టు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రధాన వీధిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించగా అమ్మవార్ల నగలు, హుండీలో డబ్బులు తానే కాజేసినట్లుగా అంగీకరించాడని వివరించారు. బాలుడు చోరీ చేసిన ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

అటవీ అధికారులతో గిరిజనుల వాగ్వాదం



అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగిన గిరిజనులు

దమ్మపేట: ఫారెస్ట్ అధికారులు, సిబ్బందితో గిరిజనులు వాగ్వాదానికి దిగిన ఘటన మండలంలోని నల్లివారిగూడెం ప్లాంటేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని నాగుపల్లి ఫారెస్ట్ రేంజ్‌లో గల నల్లివారిగూడెం ప్లాంటేషన్‌లోకి స్థానిక గిరిజనులు ప్రవేశించి జామాయిల్ చెట్లను నరకడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ప్లాంటేషన్, ఫారెస్ట్ అధికారులు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని చెట్లను నరుకుతున్న గిరిజనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో గిరిజనులకు ఫారెస్టు అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గిరిజనులు మాట్లాడుతూ.. ప్లాంటేషన్ భూములు.. ప్రభుత్వం తమకు ఇచ్చిన భూదాన్ భూములు అని, తమ భూముల్లో చెట్లను తాము నరికితే తప్పేంటని ఎదురు ప్రశ్నించారు. ఫారెస్టు రేంజర్ కరుణాకరచారి మాట్లాడుతూ.. ఈ భూములను 1973లోనే రిజర్వ్ ఫారెస్ట్ భూములుగా ధ్రువీకరించగా, 1975లో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ప్లాంటేషన్ నిమిత్తం లీజుకు ఇచ్చారని తెలిపారు. భూదాన్ భూములకు సంబంధించిన ఆధారాలు ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. అయినప్పటికీ గిరిజనులు వెనక్కు తగ్గకపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పి పంపడంతో గొడవ సద్దుమణిగింది. కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ చంద్రమోహన్, ప్లాంటేషన్ మేనేజర్ గోపీ ప్రసాద్, ప్లాంటేషన్ డిప్యూటీ మేనేజర్ సిద్దార్థకుమార్, ఎస్సై రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, బైక్ ఢీ..

అశ్వాపురం: మండలంలోని మొండికుంట అటవీ ప్రాంతంలో సాయిబాబా గుడి సమీపంలో శుక్రవారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మణుగూరు – కొత్తగూడెం ప్రధాన రహదారిపై లారీ, బైక్ ఢీకొనగా బైక్‌పై ప్రయాణిస్తున్న మండలంలోని జగ్గారం గ్రామానికి చెందిన దుగ్గిరాల రవికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

బూర్గంపాడు: ఈ నెల 5వ తేదీన బూర్గంపాడులోని గురుకుల పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జూలురుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భూక్యా పుల్లారావు (40) దుమ్ముగూడెం మండలం ఆర్లగూడెంలో గిరిజన సంక్షేమ పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సెప్టెంబర్ 5వ తేదీన పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొని మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. బూర్గంపాడుకు సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు భద్రాచలం.. అక్కడి నుంచి ఖమ్మం.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య రాధ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి సోదరుడు భూక్యా సురేశ్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

టేకులపల్లి: వివాహిత అదృశ్యమైన ఘటనపై టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. శంభునిగూడెం గ్రామానికి చెందిన కాకటి సత్యప్రసాద్‌కు కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన ఇనుపనూరి వెంకటేశ్వర్లు కుమార్తె శిరీషతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. ఈ నెల 6న బయటకు వెళ్లిన శిరీష తిరిగి ఇంటికి రాకపోవడంతో అదే రోజు భర్త సత్యప్రసాద్ తన మామకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం వివాహిత తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రాచన్నగూడేనికి చెందిన కోన వెంకటేశ్వరరావు తన భార్య రమాదేవితో కలిసి ఈ నెల 1వ తేదీన అశ్వారావుపేట మండలం తిరుమలకుంటలోని అత్తగారింటికి వచ్చాడు. ఆ తర్వాత 7వ తేదీన భార్యతో గొడవపడి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం భార్యకు ఫోన్ చేసి తన గురించి వెతకొద్దని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. దీంతో ఆయన బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్‌ఐ తెలిపారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

డీఎస్‌డీఓ అనసూయ



అంబేద్కర్ దృశ్యరూపకంలోని ఓ సన్నివేశం

పాల్వంచరూరల్: అంబేద్కర్ జీవిత చరిత్ర ఆదర్శనీయమని డీఎస్‌డీఓ అనసూయ పేర్కొన్నారు. మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో శుక్రవారం సంఘం శరణం గచ్ఛామి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవిత చరిత్రపై దృశ్యరూపకం ప్రదర్శించారు. అంబ్కేదర్ బాల్యం నుంచి పడ్డ ఇబ్బందులు, ఎదుర్కొన్న అవమానాలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని వివరించారు. అనంతరం డీఎస్‌డీఓ మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్ స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలుర కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకటేశ్వర్లు, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప, శివభాస్కర్, లక్ష్మారావు, నర్సింహారావు, రామనర్సయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో బాలిక మృతి



నక్షత్ర మృతదేహం

సింగరేణి(కొత్తగూడెం): జ్వరంతో బాధపడుతూ తొమ్మిదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి 10వ వార్డులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. 10వ వార్డు రామవరంలో నివాసముంటున్న పైడిముక్కల శ్యాంప్రసాద్, కీర్తనలకు కుమారుడు, కుమార్తె (9) నక్షత్ర ఉన్నారు. ఈ నెల 3వ తేదీన బాలికకు జ్వరం రాగా, మాతా, శిశు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడివారు చేర్చుకోకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పారు. ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించాలని వైద్యులు చెప్పడంతో బాలికను శుక్రవారం హైదరాబాద్ తీసుకెళ్తున్న క్రమంలో మృతిచెందింది. కాగా, మృతురాలి తల్లి బట్టలదుకాణంలో పనిచేస్తుండగా, తండ్రి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కాగా, బాలిక మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా సందర్శించి నివాళులర్పించారు. వైద్యశాఖ నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి మరణాలు సంభవిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు..

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మండలంలోని నర్సింహులగూడేనికి చెందిన మత్స్యకారుడు కర్నె లింగయ్య(65) గురువారం పాలేరు రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లాడు. తెప్పపైనుంచి నీటిలో పడిపోగా ఆయన కాళ్లకు వల చిక్కుకుంది. దీంతో ఆయన నీట మునిగిపోతుండగా ఇతర మత్స్యకారులు బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగయ్య గురువారం రాత్రి మృతి చెందగా, ఆయన కుటుంబీకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

15న ఆ 9 చోట్ల భారీ ర్యాలీలు

కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం సందర్భంగా వేలాదిమందితో ప్రదర్శనలు: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15న ఏకకాలంలో తొమ్మిది జిల్లాల్లో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా జిల్లా కేంద్రాల్లో కనీసం 15వేల నుంచి 20వేల మందితో భారీ ర్యాలీలు నిర్వహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం నేపథ్యంలో శుక్రవారం మంత్రులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 15న జనగామ, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, ఖమ్మం జిల్లాలలో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయని వెల్లడించారు. సీఎం కేసీఆర్ 15న ఏదో ఒక చోట కొత్త మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారని, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కామారెడ్డిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు. దేశంలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లను కలిగి ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు.

ఎస్ఈసీగా పార్థసారథి పదవీకాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా సి.పార్థసారథి పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి శుక్రవారం (సెప్టెంబర్ 8)తో ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియడంతో, ఆ రోజు నుంచే మరో ఏడాది ఎస్ఈసీగా కొనసాగిస్తూ సుల్తానియా ఆదేశాలిచ్చారు.


ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నరోత్తమ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభి వృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఏర్పుల నరోత్తమ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి హరీశ్ నియామక ఉత్తర్వులను నరోత్తమ్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు.. నరోత్తమ్ ధన్యవాదాలు తెలిపారు.

రోగాలను బట్టి పీజీ మెడికల్ సీట్లు!

ఆయా ప్రాంతాల్లో సంబంధిత స్పెషాలిటీలో ఓపీ మేరకు సీట్లు మంజూరు

- ఔట్ పేషెంట్ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్ల కేటాయింపు
- వారానికి 20 ప్రసవాలున్న కాలేజీకి రెండు గైనిక్ స్పెషాలిటీ సీట్లు
- జాతీయ మెడికల్ కమిషన్ కీలక నిర్ణయం.. ముసాయిదా విడుదల
- ఎండీలో కొత్తగా ప్రజారోగ్యం, బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్
- కొత్తగా అందుబాటులోకి 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు



సాక్షి, హైదరాబాద్: ఆయా ప్రాంతాల్లో వ్యాధులు.. రోగుల సంఖ్య..అందుతున్న వైద్య సేవలను బట్టి మెడికల్ కాలేజీలకు పీజీ సీట్లు కేటాయించాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. అంటే ఏ ప్రాంతంలో ఎలాంటి రోగాలున్నాయో, ఆయా ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీలకు ఆయా స్పెషాలిటీల్లో పీజీ మెడికల్ సీట్లు వచ్చే అవకాశం ఉంటుందన్నమాట. ఈ మేరకు కొత్త పీజీ మెడికల్ ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం.. మెడికల్ కాలేజీలో సంబంధిత స్పెషాలిటీ వైద్యంలో ఔట్ పేషెంట్ (ఓపీ)ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటేనే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేస్తుంది. ఉదాహరణకు ఒక మెడికల్ కాలేజీకి రెండు పీడియాట్రిక్ సీట్లు కావాలంటే సంబంధిత కాలేజీలో రోజుకు చిన్న పిల్లల ఓపీ కనీసం 50 ఉండాలి. ఒక ఆపరేషన్ థియేటర్ 24 గంటలు పనిచేస్తేనే రెండు పీజీ అనస్తీషియా సీట్లు ఇస్తారు. వారానికి 20 ప్రసవాలు జరిగితేనే రెండు గైనిక్ సీట్లు ఇస్తారు. ఇక సంబంధిత స్పెషాలిటీలో అదనంగా మరో సీటు కావాలంటే 20 శాతం ఓపీ పెరగాలి. సూపర్ స్పెషాలిటీకి సంబంధించి రెండు సీట్లుకేటాయించాలంటే ఆయా సూపర్ స్పెషాలిటీ విభాగంలో రోజుకు 25 ఓపీ ఉండాలి.

పడకల్లో 75% ఆక్యుపెన్సీ ఉండాలి

ఎన్ఎంసీ మరికొన్ని కొత్త నిబంధనలను కూడా ముసాయిదాలో చేర్చింది. మెడికల్ కాలేజీల్లోని స్పెషాలిటీ పడకల్లో 75 శాతం ఆక్యుపెన్సీ ఉండాలి. అల్ట్రాసౌండ్‌లు రోజుకు 30 జరగాలి. 10 సీటీ స్కాన్లు చేయాలి. రోజుకు మూడు ఎంఆర్ఐ స్కాన్లు తీయాలి. రోజుకు 15 శాతం మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి. గతంలో ఇలాంటి నిబంధనలు లేవు. సంబంధిత స్పెషాలిటీలో నిర్ణీత ఓపీ సంఖ్యతో సంబంధం లేకుండా మౌలిక సదుపాయాలు, సర్జరీలు, అన్ని రకాల ఓపీలు, ఐపీలు, బ్లడ్ బ్యాంకు నిర్వహణ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు ఉన్నాయా లేవా? వంటివి మాత్రమే చూసి సీట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రధానంగా ఓపీని ప్రామాణికంగా తీసుకొని ఇవ్వాలని నిర్ణయించారు.

ఐసీఎంఆర్ ఆన్‌లైన్ కోర్సులు చదవాలి

ఎండీలో కొత్తగా 3 కోర్సులను ఎన్ఎంసీ చేర్చింది. ప్రజా రోగ్యం, బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్‌లను ప్రవేశపెట్టింది. అలాగే సూపర్ స్పెషాలిటీలో ఉండే చిన్న పిల్లల గుండె, రక్తనాళాల కోర్సులను ఎత్తివేసి, సాధారణ గుండె, ఛాతీ, రక్తనాళాల సర్జరీలో చేర్చింది. సూపర్ స్పెషాలిటీలో ఉన్న ఛాతీ శస్త్రచికిత్స కోర్సును ఎత్తివేసి సాధారణ గుండె శస్త్రచికిత్సలో కలిపేసింది. అలాగే 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశ పెట్టింది. అవయవ మార్పిడి అనస్తీషియా, పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీ, లేబొరేటరీ ఇమ్యునాలజీ, న్యూక్లియర్ నెఫ్రాలజీ, రీనాల్ పేథాలజీ, గ్యాస్ట్రో రేడియాలజీ, రక్తమార్పిడి థెరపీ, పెయిన్ మేనేజ్‌మెంట్, హిమటో ఆంకాలజీ, పీడియాట్రిక్ ఈ ఎన్‌టీ, స్పైన్ సర్జరీ కోర్సులు ప్రవేశపెట్టారు. పీజీ అయిపోయిన వా రు ఈ కోర్సులను చేసే సదుపాయం కల్పించారు. ఇక పీజీ చేసే ప్రతి విద్యార్థి మొదటి ఏడాది ఐసీఎంఆర్ నిర్వహించే ఆన్‌లైన్ కోర్సులు తప్పనిసరిగా చదవాలి. ఈ ముసాయిదాలోని అంశాలపై అభ్యంతరాలను 15వ తేదీలోగా తెలియజేయాలని ఎన్ఎంసీ కోరింది.

ఇలా అయితేనే ఉపయోగం

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు దాదాపు అన్ని జిల్లాలకు విస్తరించాయి. అందువల్ల ఆయా మెడికల్ కాలేజీల్లో పీజీ మెడికల్ సీట్లను స్థానిక రోగాలను బట్టి కేటా యిస్తేనే ఉపయోగం ఉంటుంది. ఎన్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో శాస్త్రీయ మైనది. ఆయా ప్రాంతాల రోగులకు సంబంధిత వైద్యం అందుబాటులోకి వస్తుంది.

- డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

సర్టిఫికెట్ల తనిఖీకి ప్రత్యేక సెంటర్!

- గురుకుల అభ్యర్థుల కోసం హైదరాబాద్‌లో ఏర్పాటు
- 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- 2 వారాలు కొనసాగేలా ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువుల నియామకాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పా ట్లు చకచకా చేస్తోంది. ఇప్పటికే అర్హత పరీక్షలన్నీ నిర్వహించిన బోర్డు... మెజార్టీ సబ్జెక్టు లకు సంబంధించి తుది కీలను సైతం విడుదల చేసింది. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేట గిరీలకు సంబంధించి కోర్టు పరిధిలో కేసులుండటంతో ఆయా పరీక్షల తుది కీలను ఇంకా ఖరారు చేయలేదు. ప్రస్తుతం ఫైనల్ కీలు ఖరారు చేసిన సబ్జెక్టులకు సంబంధించి మెరిట్ జాబితాలను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

9210 పోస్టుల భర్తీకి..

గురుకుల విద్యా సంస్థల్లో ప్రధానంగా 9 విభాగాల్లో 9210 పోస్టుల భర్తీకి టీఆర్ఈఐ ఆర్‌బీ 9 రకాల ప్రకటనలు జారీ చేసింది. ఇందులో 61 సబ్జెక్టుల్లో ఈ పోస్టులున్నాయి. ఈ క్రమంలో ఒక్కో పోస్టుకు ఇద్దరు అభ్యర్థుల చొప్పున ఎంపిక చేస్తూ మెరిట్ జాబితాలు విడుదల చేస్తారు. 1:2 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ సెంటర్‌కు హాజరై పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. తొలుత జిల్లాల వారీగా పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉండడం... మరోవైపు రెండు వారాల పాటు పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తుండడంతో హైదరాబాద్‌లో ఒక కేంద్రం ఏర్పాటు చేస్తే సరిపోతుందని బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. ఈమేరకు పరిశీలన కేంద్రం ఏర్పాటు, నిర్వహణపైన కసరత్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో తేదీల ఎంపిక...

వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థి ముందుగా టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల్లో అభ్యర్థికి అనుకూలంగా ఉన్న ఒక రోజును ఎంపిక చేసుకుని ఆమేరకు పరిశీలనకు హాజరు కావాలి. ఈనెల మూడో వారం నాటికి మెరిట్ జాబితాలు రెడీ చేసేలా బోర్డు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మెరిట్ జాబితాలు ఖరారైన తదుపరి వారంలోనే పరిశీలన ప్రక్రియ ప్రారంభించనుంది.

‘ధిక్కరణ’ వేయండి.. చర్యలు తీసుకుంటాం

వినాయక విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: గతేడాది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించి హుస్సేన్‌సాగర్‌లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ)తో తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారన్న ఆధారాలుంటే...ధిక్కరణ పిటిషన్ వేయాలని న్యాయవాది వేణుమాధవ్‌ను హైకోర్టు ఆదేశించింది. సరైన ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని వ్యాఖ్యానించింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చిన్నచిన్న కొలనుల్లో మాత్రమే పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయాలన్న మధ్యంతర ఉత్తర్వులు ఇంకా అమల్లోనే ఉన్నాయని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. పీఓపీతో తయారు చేసే విగ్రహాలపై నిషేధం ఎత్తివేయాలని, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిబంధనలను కొట్టివేయాలని కోరుతూ ధూళ్‌పేటకు చెందిన తెలంగాణ గణేశ్‌మూర్తి కళాకారుల సంక్షేమ సంఘంతో పాటు మరికొందరు హైకోర్టులో 2022లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ హరేందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ.. పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయలేదని, తాత్కాలిక కొలనుల్లో చేశామని తెలిపారు. ఈ క్రమంలో న్యాయవాది వేణుమాధవ్ వాదిస్తూ.. కోర్టు ఆదేశాలున్నా పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనం చేశారని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, విచారణను వాయిదా వేసింది.

కేటీఆర్‌తో ఎమ్మెల్యే చెన్నమనేని భేటీ

సాక్షి, హైదరాబాద్: వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ శుక్రవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో భేటీ అయ్యారు. గత నెల 21న ప్రకటించిన బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో చెన్నమనేని రమేష్‌కు అవకాశం దక్కక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను రాష్ట్ర వ్యవసాయ రంగ ప్రధాన సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా, దుబాయ్ పర్యటన ముగించుకుని 20 రోజుల తర్వాత రాష్ట్రానికి తిరిగి వచ్చిన కేటీఆర్‌తో రమేష్ తాజాగా సచివాలయంలో భేటీ అయ్యారు. వేములవాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల అనుమతులు, కలికోట సూరమ్మ చెరువు, ముంపు గ్రామాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమితులైన రమేష్‌కి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గురుతరమైన బాధ్యత అప్పగించిన కేటీఆర్‌తో పాటు సీఎం కేసీఆర్‌కు ఈ సందర్భంగా చెన్నమనేని ధన్యవాదాలు తెలిపారు.

మేనేజ్‌మెంట్ వైద్య సీట్లకు మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వాస్త వంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఒకసారి మాత్రమే చేసుకోవాలి. ఆ తర్వాత విడతల వారీగా ఆప్షన్లు పెట్టుకోవచ్చు. కానీ కొందరు విద్యార్థులు వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కార్యాలయం తెలిపింది. పూర్తి వివరాలతో సోమవారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని వెల్లడించింది.

జిల్లా వార్తలు

రేపటి నుంచి జనసేవాదళ్ జాతీయ స్థాయి శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: జనసేవా దళ్ జాతీయ శిక్షణ శిబిరం ఈ నెల 10 నుంచి ప్రారంభం కానుందని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ శతజయంతోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా లక్ష మంది యువకులకు శిక్షణనిచ్చే క్రమంలో జాతీయస్థాయి ఇన్‌స్ట్రక్టర్లకు పది రోజుల పాటు ఖమ్మంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దేశంలోని 22 రాష్ట్రాల నుంచి 200 మంది హాజరుకానుండగా, ఖమ్మం బైపాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. కాగా, ప్రారంభ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తదితరులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

మణుగూరు ఏరియాలో పర్యటించిన అధికారులు

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో డీఎంఎస్ (ఎలక్ట్రికల్) ఎస్.ఆనంద్ వేల్, డీవైడీఎంఎస్ (ఎలక్ట్రికల్) లడ్డా శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి వారు ఉపరితల గనులు, కేసీహెచ్‌పీ, సబ్‌స్టేషన్లను పరిశీలించి బొగ్గు ఉత్పత్తి, రవాణా, విద్యుత్ ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమైన వారు మాట్లాడుతూ.. నిబంధనల మేరకు రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రతీఒక్కరు విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ప్రాంతాల్లో సిబ్బంది తప్ప ఇతరులు, పశువులు ప్రవేశించకుండా భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు వీసం కృష్ణయ్య, వెంకటరమణ, నర్సిరెడ్డి, శ్రీనివాసాచారి, వీరభద్రుడు, మదన్‌నాయక్, రవీందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పని చేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన, మృతి చెందిన కార్మికుల పిల్లలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారికి వారసత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ ధన్‌పాల్ మాట్లాడుతూ ఇంటర్వ్యూలతో పాటు వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి కారుణ్య నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎం.రమేష్‌బాబు, కె.బాలభాస్కర్‌రావు, సుశీల్‌కుమార్, రామశేషయ్య, టీఆర్ ప్రసన్నరాజు, సాయస్వప్నిల్ పాల్గొన్నారు.

మూతపడిన విజయ డెయిరీ పార్లర్

- లీజ్ గడువు ముగిసినా రెన్యువల్ చేసుకోని నిర్వాహకులు
- డెయిరీ నుంచి పాలు, పాల ఉత్పత్తుల సరఫరాకు బ్రేక్



ఖమ్మంలో మూతపడిన ప్రభుత్వ డెయిరీ మెగా పార్లర్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ (విజయ) మెగా డెయిరీ పార్లర్ మూతపడింది. ఖమ్మం రోటరీనగర్ ప్రధాన సెంటర్‌లోని ఈ కేంద్రంలో వివిధ రకాల పాలు, పాల పదార్థాలతో పాటు విజయ బ్రాండ్ వస్తువులను విక్రయిస్తుండగా మంచి ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విజయ డెయిరీ పార్లర్లు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్టర్ 2017లో ఖమ్మం వచ్చినప్పుడు ఆసక్తి చూపించడంతో డెయిరీ వెంట షెడ్డు నిర్మించి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇందులో విజయ పాలు, ఇతర ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అనుమతించారు. అడ్వాన్స్‌గా రూ.3 లక్షలు, నెల కిరాయి రూ.10 వేలుగా నిర్ణయించగా.. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కరోనా సమయంలో మూతపడినా ఆ తర్వాత ఏడాది లీజ్ విధానంతో ప్రారంభించారు. అయితే, ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీతో లీజు గడువు ముగిసినా నిర్వాహకులు రెన్యువల్ చేసుకోలేదు. ఈ విషయాన్ని డెయిరీ అధికారులు ఉన్నతాధికారులకు తెలిపాక కాంట్రాక్టర్‌కు డెయిరీ ఉత్పత్తుల సరఫరా నిలిపి వేశారు. ఈక్రమంలో కాంట్రాక్టర్ పార్లర్‌ను ఖాళీ చేశారు. ఈ విషయమై ఖమ్మం డెయిరీ ఉప సంచాలకులు డాక్టర్ కుమారస్వామిని వివరణ కోరగా.. పార్లర్ లీజ్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పాత కాంట్రాక్టరే రెన్యువల్ చేసుకుంటారా, కొత్తగా టెండర్లు నిర్వహిస్తారా అన్నది తెలియాల్సి ఉందని చెప్పారు. కాగా, ప్రజల నుంచి మంచి ఆదరణ ఉన్న ప్రభుత్వ డెయిరీ మూతపడడంతో వినియోగదారులకు ఇబ్బంది కలగడమే కాక సంస్థకు సైతం నష్టం వచ్చే అవకాశమున్నందున అధికారులు స్పందించాల్సిన అవసరముందనే భావన వ్యక్తమవుతోంది.

గురుకులాలకు నిలిచిన పాలు, పెరుగు సరఫరా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యాలయాలకు మూడు రోజులుగా పాలు, పెరుగు సరఫరా నిలిచిపోయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు విజయ డెయిరీ పార్లర్ నుంచి పాలు, పెరుగు సరఫరా చేస్తారు. ఇటీవల డెయిరీ కాంట్రాక్టర్ లీజు ముగియడంతో రెన్యువల్ చేసుకోలేదు. దీంతో విద్యాసంస్థలకు సరఫరా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఎస్సీ గురుకులాల్లో 8 వేల మంది, బీసీ గురుకులాల్లో 6 వేల మంది, మైనారిటీ, ఎస్టీ గురుకులాల్లో 6 వేల మంది విద్యార్థులు ఉండగా, వారికి మూడు రోజుల నుంచి పాలు, పెరుగు అందడం లేదు. పలు గురుకులాల్లో పెరుగును బయట కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఎస్సీ, బీసీ గురుకులాల ఆర్సీఓలను వివరణ కోరగా పాలు, పెరుగు సరఫరా నిలిచిపోయిందని, కలెక్టర్ ఆదేశాలతో శనివారం నుంచి సరఫరా పునరుద్ధరిస్తామని కాంట్రాక్టర్ చెప్పారని పేర్కొన్నారు.

మోసం చేయడంలో మోదీ, కేసీఆర్ పోటాపోటీ



మాట్లాడుతున్న హేమంతరావు, పక్కన గుమ్మడి నర్సయ్య, సుదర్శన్‌రావు, నాయకులు

- కార్పొరేట్లకు రూ.57 వేల కోట్లు దోచిపెట్టిన కేంద్రం
- ఎస్‌కేఎం సదస్సులో రైతు సంఘాల రాష్ట్ర నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రైతులను మోసం చేయడంలో అటు ప్రధాని మోదీ, ఇటు సీఎం కేసీఆర్ పోటీ పడుతున్నారని, ఇలాంటి రైతు వ్యతిరేకులను గద్దె దించితేనే వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవచ్చని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ వెల్లడించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని బతికించుకునే క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దె దించేందుకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో కార్పొరేట్లకు దోచి పెడుతోందని, రైతుబంధు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కూడా మోసానికి పాల్పడుతోందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు కేవలం భూస్వాముల ఖజానా నింపేందుకే ఉపయోగపడుతున్నాయి తప్ప, సన్న, చిన్నకారు రైతులకు మేలు జరగడం లేదని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా యోజన పథకం ద్వారా రూ.57 వేల కోట్లు బీమా కంపెనీలకు దోచి పెట్టారని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆదుకునేందుకు బీమా సౌకర్యం లేక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు కెచ్చెల రంగారెడ్డి, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి మాట్లాడగా.. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు చంద్ర నరేంద్రకుమార్, అన్నవరపు సత్యనారాయణ, కల్లూరి కిశోర్, కందగట్ల సురేందర్, బానోత్ ఊక్లానాయక్, ఎస్కే సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, ముత్యాల విశ్వనాథం, ఎల్.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రాథమిక సామర్థ్యాలే ప్రధానం

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



వీసీలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్, పక్కన అధికారులు

భద్రాచలం: విద్యార్థులు భవిష్యత్‌లో రాణించాలంటే ప్రాథమిక స్థాయిలో వారి సామర్థ్యాలు పెంపొందించడమే కీలకమని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులతో పలు అంశాలపై సమీక్షించారు. త్వరలో మొదలుకానున్న విద్యార్థుల కనీస సామర్థ్యాల అంచనా కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కోవిడ్ సమయంలో ప్రత్యక్ష బోధన లేకపోవడం, ఇతరత్రా కారణాలతో విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు తగ్గినందున ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ యాప్‌లో కేటాయించిన వర్గాల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి నమోదు చేయాలని చెప్పారు. అలాగే, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సూచన మేరకు పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా రూపొందించిన వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలుచేసి మెరుగైన ఫలితాలను సాధించాలని ఆదేశించారు. వీసీలో ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, జీసీడీఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి గిరిజన సంస్కృతిని అందించాలి

ప్రస్తుత తరానికి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను అందించేందుకు సహకరించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిలం రామచంద్రయ్యను ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ కోరారు. ప్రముఖ డోలి కళాకారుడైన రామచంద్రయ్య శుక్రవారం పీఓను భద్రాచలంలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్యను అభినందించిన పీఓ.. ఈ కళను ప్రస్తుత తరానికి అందించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



పీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రామచంద్రయ్య

లక్కీడిప్ విజేతలకు చెక్కులు



ఖమ్మం రీజియన్‌లోని విజేతలతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, అధికారులు

హైదరాబాద్‌లో అందజేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఖమ్మం మామిళ్లగూడెం: రాఖీ పండగ సందర్భంగా గత నెల 30, 31వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల కోసం లక్కీ డ్రా ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఖమ్మం రీజియన్‌లో ఆరు డిపోల పరిధిలోని బస్సుల్లో ప్రయాణించిన మహిళల నుంచి విజేతలను ఇటీవల ఎంపిక చేశారు. సత్తుపల్లికి చెందిన రుక్మిణి, కల్లూరుకు చెందిన జి.భారతి, పెనుబల్లి మండలం తుమ్మలపల్లికి చెందిన లక్ష్మి మొదటి మూడు స్థానాల్లో నిలవగా హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్ బహుమతులు అందజేశారు. వీరికి వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేల చెక్కులను అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో ఖమ్మం ఆర్ఎం సీహెచ్.వెంకన్న, డీఆర్ఎం జీ.ఎస్.పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు